
# వెనుతిరగని వెన్నెల - ఒక స్టీల్ మాగ్నోలియా

——విద్యార్థి




అమెరికా దక్షిణాది రాష్ట్రాలలో 'Steel Magnolias' అనే వాడుక ఒకటి వున్నది. శీతాకాలంలో దుర్భరమైన చలికి, మంచుకి నిలబడి, పెద్ద పెద్ద దోసిళ్లంత పూలతో తనను తాను కప్పుకుని వసంతాన్ని ఆవిష్కరిస్తూ అందరినీ ఆహ్లాదపరిచే చెట్టు "Magnolia". ఎన్నో కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ఉక్కులాగా నిలబడుతూ, సున్నితంగా సమస్యలను పరిష్కరించుకుని తన చుట్టూ ఉన్నవారిని ఆహ్లాదపరిచే ఆడవారిని "Steel Magnolias" అని పిలుస్తారు. ఈ నవలా నాయిక "తన్మయి" అటువంటి Steel Magnolia.

ఈ నవల ఒక కాలనాళిక. 1970, 80, 90ల ప్రాంతాలలో పెరిగినవాళ్లందరూ ఎప్పుడో ఒకప్పుడూ ఈ నవలలోని సన్నివేశాలు ప్రత్యక్షంగా చూసినవారే. చాలా మంది తెలుగు మహిళలు తమ నిజ జీవితంలో అనుభవించి, వికసించిన

"Steel Magnolias" అయ్యి ఉండ వచ్చు కూడా. సన్నివేశం మారవచ్చు, కానీ ఇది వారి కథ కూడా. నాయిక అందరు యువతుల లాగా అందమైన సాంసారిక జీవితాన్ని కోరుకోవటం సహజం, సామాన్యమే. తనకు నచ్చినవాడినే పెళ్ళి చేసుకుంటాను అని పట్టు పట్టడం ఆ రోజులలో సాంప్రదాయానికి విరుద్ధం. అదే సాంప్రదాయం పెళ్లి కార్యక్రమాన్ని ఒక లావాదేవీగా నడిపి, వ్యవస్థీకరించిన పెద్దలను మాత్రం తప్పు పట్టదు, అంగీకరించి పెంచి పెద్ద చేసింది. ప్రేమిస్తున్నాని ఎర వేసి పెళ్లి దాకా తీసుకువచ్చి, తల్లి తండ్రుల పేరాశ కోరికలకు తన కోరికలు రెట్టించి జోడించి, ఆడపిల్ల తల్లి తండ్రుల ఆస్తుల మీద తమ హక్కు ప్రదర్శించాలనుకునే పెళ్లి కొడుకులూ ఈ నాటికీ బోలెడు మంది. ఆ స్త్రీ సంపాదన కూడా తమకే చెందాలనుకునే పెళ్లి కొడుకులూ వారి తల్లి తండ్రులూ కూడా చాలా మందే ఉన్నారు. ఈ దుస్సాంప్రదాయాలని నిలువరించటానికి స్త్రీ విద్య, ఆర్ధిక స్వేచ్ఛలు కొంతవరకు సమాధానం అవవచ్చు. సమాజ పరివర్తన కూడా అవసరం. కానీ సమాజం అంత తొందరగా మారదు. సతీ సహగమనం నుండి పుత్తడి బొమ్మ పూర్ణమ్మ దశకు మారటం పురోగతి అని చెప్పలేము. జంతువులను కూడా బ్రతికి వున్నవాటిని కాల్చరు, పసిదాన్ని బ్రతకనివ్వటం ఒక పిసరంత మెరుగు అనుకోక తప్పదు. అలాగే పుత్తడి బొమ్మ పూర్ణమ్మ దశనుండి, ఎంతో కొంత చదువుకున్న ఆడపిల్లలని చేసుకుని కట్నాలు చాలలేదని దహించిన వార్తలు 70 దశకంలో రోజూ కనబడేవి. అది కూడా పురోగతి అనిపించదు, కానీ పిసరంత మెరుగేమో. అలాగే, కట్న కానుకల కోసం శారీరక హింసలు కొంత వరకు తగ్గి, మానసిక హింసలకు గురిచేసే కాలం పిసరంత పురోగతి అనుకోవాలేమో! కానీ కాదు. ఈ రోజులలో అమ్మాయికి చదువు ఎందుకు అనుకునే మధ్య తరగతి వాళ్లు చాలా తక్కువ. మా అమ్మాయికూడా చదువుకుని తన సంపాదన తనకి ఉండాలి అనుకునేవాళ్లే ఎక్కువ. ఇది మాత్రం పురోగతే. ఆ పరివర్తనలోని ఒక దశకు నవలా రూపంలోని కాలనాళిక ఈ "వెనుతిరగని వెన్నెల".

తన్మయి రావల్సిన సామాజిక పరివర్తనకు మార్గదర్శకురాలు కూడా . కష్టాలు పంచుకుంటూ ఓదార్పు మాటలతో తన్మయి స్నేహితురాలు మేరీ మగవాళ్లనందరినీ ఒక గాటను కట్టివేస్తుంటే, "నా కొడుకు కూడా మగవాడే కదా, తండ్రి లాంటివాడు కాకుండా పెంచాలి" అని తన్మయి అంటుంది. సామాన్యంగా కనిపించే ఈ మాటలలో మంచి నిర్దేశ్యం ఉన్నది. అందరు తల్లులు తమ కొడుకులకి కూతుళ్లతో పాటే వంటింటి పనులు, ఇంటి పనులు నేర్పితే, తరువాతి తరంలో స్త్రీ సమానత్వానికి తోడ్పడినవారవుతారు. అలా కాకుండా, నా కొడుకు మగవాడు, "పళ్లెంలో చేతులు కడిగేస్కోరా, చెల్లెలు తీస్తుంది" అని అంటూ వుంటే, కూతురికి, కోడలికి కూడా అపకారం చేసినవారవుతారు. చిన్న చిన్న మార్పులతోనే పెద్ద పెద్ద సామాజిక మార్పులు తీసుకు రావచ్చు.

పాత్రల చిత్రీకరణ కూడా చాలా సహజంగా వున్నది. అత్తగార్లు, తల్లి పాత్రలు అందరికీ పరిచయమైనవే. ప్రసవ సమయంలో పొట్టకి సాయిబాబా విభూది రాసి విసుక్కునే లేడీ డాక్టరు, మగవారికి తెలియని పాత్ర. చదువుకున్నది పెద్ద చదువే, కానీ సాటి మహిళ మీద దయలేని పాత్ర. ఈ పాత్ర కూడా వాస్తవికతతో నిండిన పాత్రే అయ్యివుండవచ్చు. అలాగే మార్కులు, రాంకుల సమాజంలో అసూయపరుడైన కరుణలాంటి వారు అందరికీ కనబడే వుంటారు. మురళి పాత్ర ఒక flawed character, అందరినీ బాగు చేద్దామనుకునే వాడు, అన్నీ మంచి పనులు చేస్తూ సదుద్దేశ్యాలు కలిగినవాడు, తనకు బాల్య వివాహం అయితే భార్యను అంగీకరించలేకపోయాడు. తాయిబా, సిద్ధు స్వచ్ఛమైన పాత్రలు, వాళ్లూ మనకి కనబడుతూనే ఉంటారు. మేరీ, వనజ పాత్రలు మనసు పంచుకునే మిత్రుల సహజమైన పాత్రలు, వారి కథలు కూడా ఇంకొంచెం తెలుపవలసిందేమో! అనంత, రాజు, దివాకర్ పాత్రలు మంచి స్నేహితులు. తన కష్టాలేవో తనకు తెలియని చేపల వాడి భార్యది చిన్న పాత్ర అయినా, కష్టాలు అనే భావాలు మనం తగిలించుకున్నవేనా అని ఆలోచింపచేసే పాత్ర. ఇక ముఖ్యమైన పాత్రలు, శేఖర్ ప్రతినాయకుడు, ఎక్కడా తన్మయిని శారీరకంగా హింసించినట్లు కనబడదు, బోలెడు మానసిక హింస పెట్టిన పాత్ర. కానీ, భార్య ఇష్టం తెలుసుకోకుండా తన శారీరక కోర్కెలు తీర్చుకోవటం తన్మయిని పెట్టిన శారీరక హింస అని ఒప్పుకుని తీరాలి (ఈ విషయంగా భారతీయ కూడా న్యాయవ్యవస్థలో మార్పులు రావాలి, పాశ్చాత్య దేశాలలో ఇది బలాత్కారంగా పరిగణించబడుతుంది). శేఖర్ నాణానికి రెండో వైపు ప్రభు, అందరికీ మంచి చేద్దామనుకుంటూ, సంఘర్షణతో కొట్టుమిట్టాడుతూ, చెప్పుడు మాటలకు లోనవుతూ, బాబు మీద విముఖత చూపించినవాడు. ఇది కూడా సహజమైన పాత్రే. సవతి తల్లికి బిడ్డ మీద అంతగా ప్రేమ ఉండదంటారు, ప్రభు ఆ సవతి తల్లికి ప్రతి రూపమేమో. తండ్రి భానుమూర్తి నిజమైన మంచి తండ్రి, కానీ సాంప్రదాయపు ఆలోచనలకి కట్టుబడి వున్నవాడు, అది ఆయన తప్పు కూడా కాదేమో!

ఈ నవల మానవీయతా విలువలకు చెందిన నవల. ఇది భారతీయ సమాజంలో నేటికీ వ్యవస్థీకృతమైన స్త్రీ పురుష తారతమ్యాలకి ప్రతిబింబం. Heroism కథలకు మాత్రమే అలవాటుపడిన సమాజంలో తనకు తాను నిలబడేవారిని గుర్తించి, వారే పురోగతికి మార్గదర్శకులు అని చెప్పగలిగే కథ ఇది. అలాగే పేజీల సంఖ్యలో పెద్దనవల అయినా పాఠకుడిని ఒక్క ఉదుటున చదివించగలిగిన మంచి నవల. ఒక మంచి నవలకు వుండవలసిన లక్షణాల గురించి చాలా చర్చలు, ఉపన్యాసాలు, వ్యాసాలు ఉన్నాయి. కానీ, పాఠకుడు అసలు ఎందుకు చదవాలి అని ప్రశ్నించుకుంటే, Jane Austen మాటలు గుర్తుకు వస్తాయి. "Some work in which the greatest powers of the mind are displayed, in which the most thorough knowledge of human nature, the happiest delineation of its varieties, the liveliest effusions of wit and humour are conveyed to the world in the best

chosen language (Northranger Abbey)". ఈ మాటలకు గుండెలలో నుంచి వచ్చిన కథ అనే లక్షణాన్ని జోడిస్తే, పాఠకుల హృదయాలకు చేరుతుంది. నవలలో చెప్పిన మాటలు, విషయాలు కొన్నైనా పాఠకుల మనసులలో నిలుస్తాయి. అనవసరమైన ఫిలాసఫీ, వర్ణన కోసం వర్ణనలూ లేకుండా, చెప్పవలసిన విషయాన్ని సూటిగా, సరళమైన వాక్యాలతో నడిచిన శైలి. మంచి మాటలూ, సందర్భోచితమైన సూక్తులూ/శ్లోకాలూ కూడా చాలానే వున్నాయి. అందుకే ఒక్క ఉదుటున చదివించగలిగింది.

ఈ నవల చదువుతున్నప్పుడు కొడవటిగంటి కుటుంబరావుగారి "చదువు" అక్కడక్కడా గుర్తుకు రాక మానదు. రెండు నవలలూ ఒక వ్యక్తికి చదువు మీద ఉన్న ధ్యేయం గురించే. ఆ సాధనలో జరిగిన ప్రయాణం గురించే. "చదువు" కథా గమనంలో గడిచిన కాలం సుమారు ఇరవయ్యేళ్లు. "వెనుతిరగని వెన్నెల"లో గడిచిన కాలం కూడా సుమారు ఇరవయ్యేళ్లు. "వెనుతిరగని వెన్నెల", "చదువు" నవలలకి కొన్ని సన్నివేశాలలో కూడా సారూప్యాలు ఉన్నాయి. ఉదాహరణకి "చదువు" నవలలో రాళ్లతో కట్టిన University Hostel లో ఎప్పుడూ ఇసకవంటిదేదో రాలుతుంది అని రాసారు. తన్మయి రీసర్చ్ స్కాలర్స్ హాస్టల్‌లో పిల్లుల వాసన, దుర్గంధం గురించి చెప్పారు. అలా అని "వెనుతిరగని వెన్నెల", "చదువు"కి ఏ మాత్రం అనుకరణ కాదు, అసలు సిసలైని మౌలికత ఉన్న నవల. "చదువు" ఒక చారిత్రక ప్రాతినిధ్య నవల అని విమర్శకులు అన్నారు. "వెనుతిరగని వెన్నెల" కూడా ఒక చారిత్రక ప్రాతినిధ్య నవల అనటానికి ఏ మాత్రం సందేహించనవసరం లేదు. కానీ "చదువు" కంటే "వెనుతిరగని వెన్నెల" నా ఉద్దేశ్యంలో గొప్ప నవల. ఎందుకంటే "చదువు"లో నాయకుడు చివరికి ఒక అసమర్ధ నాయకుడు. తన్మయి అలా కాదు, ఒక సమర్ధ నాయిక. మరి ఈ నవలను కూడా యువతకు ఒక పాఠ్యాంశంగా ఉంచితే, చదివి విశ్లేషించి స్ఫూర్తి పొందటానికి అవకాశం కలుగుతుంది. మార్కులు, రాంకుల కాలంలో, ఏదో ఒక పరీక్షా పత్రానికి జవాబు లాగా కాకుండా, విద్యార్థులకి చర్చాంశంగా ఉంటే, యువత ఆలోచన సరళి మారే అవకాశం ఉంటుంది, సామాజిక పురోగతికి తోడ్పడుతుంది.

అసమర్ధ నాయకుల కథలు పండిత వర్గంలో మంచి ప్రాచుర్యం పొందాయి. ఎన్నో విశ్లేషణలూ, పరిశోధనలూ జరిగాయి. ఉపన్యాసాలు ఎవరికి తోచినంత వారు ఇచ్చారు. అలాగే, ఒక స్త్రీ దిగజారుడుతనం గురించి వదంతులతో కూడుకున్న నవలకు అత్యుత్తమ పురస్కారం లభించింది. ఇవి ఏవీ స్ఫూర్తి నిచ్చి సామాజిక పురోగతికి తోడ్పడిన రచనలు కాదు. అవి అన్నీ అవరోహణా ప్రక్రియలు. "వెనుతిరగని వెన్నెల" స్ఫూర్తినిచ్చి బోలెడు ఉక్కు పుష్పాలను తయారు చేయగల మంచి కథ.

★★★